

శివోహం



విశేషాలంకరణలో శ్రీకాళహస్తీశ్వరాలయం

వి.కోట సమీపం కమ్మసంద్రలోని కోటిలింగేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల అలంకరణలో 108 అడుగుల శివలింగం

మహాశివరాత్రి సంబరాలకు శివాలయాలన్నీ ప్రత్యేక అలంకరణలతో సిద్ధమయ్యాయి.పగలంతా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాయంత్రం హరికథా కాలక్షేపాలతో....దర్శనార్థం తరలి వచ్చే భక్తజనంతో బుధవారం ఆలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంటుంది.రాత్రి జాగారం చేసే భక్తులకోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వ ముఖ్య శాఖల మధ్య సమన్వయ లోపం... కిందిస్థాయి సిబ్బందికి శాపంగా మారింది. కొందరు అధికారుల తీరుతో వీఆర్వోలకు ఉద్యోగం కత్తి మీద సాములా మారింది.ఏకకాలంలో అటు తహసీల్దార్, ఇటు ఎంపీడీవో కార్యాలయాల నుంచీ పనులను పురమాయిస్తుండడం.... పైగా లక్ష్యాలు విధిస్తుండడంతో ఏమి చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు.



అటూ ఇటూ!

● తీవ్ర ఒత్తిళ్ళ మధ్య వీఆర్వోల విధులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):రెవిన్యూశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసేది వీఆర్వోలే. మండలస్థాయిలో అధికారులు సచివాలయ వీఆర్వోలతో పాటు సాధారణ వీఆర్వోలను కూడా విపరీతంగా వాడేస్తున్నారు. రెవిన్యూశాఖ ద్వారా వీఆర్వోలకు జాబ్‌చార్ట్ వున్నా, అందుకు భిన్నంగా అన్ని శాఖలూ వారిపై భారాలు మోపుతున్నాయి.భూరికార్డుల నిర్వహణ నుంచి అప్డేషన్ వరకు, పాస్‌బుక్కులు, ఎఫ్‌ఎంబీ పరిశీలన, వీజీఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వంటి పనుల నిమిత్తం కార్యాలయంలో ఉండడంతో పాటు క్షేత్రస్థాయిలోనూ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాబ్‌చార్టుకు అదనంగా ఎన్నికల డ్యూటీలు, రీసర్వే, హౌస్‌హోల్డ్ సర్వే, జియో ట్యాగింగ్‌తో పాటు మరెన్నో విధులు తప్పనిసరి కావడంతో వీఆర్వోలు ఇబ్బంది పడుతున్నారు.

● ఛార్జిమెమోలిస్తూ బెదిరిస్తున్నారు

ఒకవైపు తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్ళాలని ఆదేశాలిస్తుంటే మరోవైపు ఎంపీడీవోల ద్వారా పంచాయతీ సెక్రటరీలు తమకు తెలియకుండా ఇష్టమొచ్చినట్లు వెళ్ళిపోతే ఎట్లా అంటూ ఛార్జిమెమోలిస్తూ బెదిరిస్తున్నారు. ప్రస్తుతం ఎంపీడీవోలు వేతనాలు చెల్లిస్తుండడంతో, తహసీల్దార్లు చెప్పిన పనులు చేయకపోతే వారి బెదిరింపులు అంతకు రెట్టింపుగా ఉంటున్నాయి. తహసీల్దారు, ఎంపీడీవోల మధ్య ఏర్పడుతున్న సమన్వయ లోపంతో వీఆర్వోలు ఇబ్బంది పడుతున్నారు.జిల్లావ్యాప్తంగా సుమారు 480మంది గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలు పనిచేస్తుండగా,వీరిలో వందమందికి పైగా మహిళలున్నారు.సాయంత్రం 5గంటల తర్వాత తహసీల్దార్లు సర్వేలపై మీటింగులు, టెలికాన్ఫరెన్స్‌లు పెడుతుండడంతో మహిళా వీఆర్వోలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.ఐదు గంటల సమయానికి సచివాలయాల్లో ముఖ ఆధారిత హాజరు వేయాల్సిన సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశంలో ఉండాలని ఒత్తిడి చేస్తుండడంతో వీఆర్వోలు ఏం చేయాలో అర్థంకాక మధనపడుతున్నారు.

● గత సర్కారు తీరే కారణం

వీఆర్వోల విధులు రెవిన్యూశాఖ పరిధిలోనే వున్నా, సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత వారితో పాటే వీఆర్వోల వేతనాలు కూడా ఎంపీడీవోలు ఇచ్చేలా గత వైసీపీ ప్రభుత్వం మార్పులు చేసింది.ఈ అనాలోచిత చర్య కారణంగా వీఆర్వోలకు పని వత్తిడి పెరిగింది. వీఆర్వోలే బూత్‌లెవల్ అధికారులు (బీఎల్వోలు)కావడంతో ఓటర్ల జాబితా పనులు చేయాల్సి వుంది. మరోవైపు జాతీయ రహదారులు, గృహనిర్మాణాలకు భూసేకరణ, ప్రజాఫిర్యాదుల వేదిక ద్వారా అందే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వెళ్ళి సమస్యను పరిష్కరించి అర్జీదారుడి ఫొటోతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాల అవినీతిని వెలికితీసేందుకు రీసర్వే, ఫ్రీహోల్డ్ భూముల విచారణ కూడా చేపడుతున్నారు.

● మావాడు.... కాదు కాదు మావాడు

పెరిగిన పని ఒత్తిళ్ళ కారణంగా ఎవరికి వారు వీఆర్వో తమవాడంటే తమవాడంటూ విధులు అప్పగిస్తున్నారు.ఏకకాలంలో అటు తహసీల్దార్, ఇటు ఎంపీడీవో కార్యాలయాల నుంచీ పనులప్పగిస్తుండడంతో క్షేత్రస్థాయిలో వీఆర్వోలు రెండుచోట్లా విధులకు హాజరుకాలేక సతమతమౌతున్నారు.సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయలేక అధికారులతో మాటలు పడుతూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.చాలామంది ఆస్పత్రులపాలవుతున్నారంటే వారి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● ఎంపీడీవో పరిధిలో వేతనాలు


గతంలో రెవిన్యూశాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధం చేసి పంపే అధికారం తహసీల్దార్లకే ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఆర్వోలకు వేతనాలు వేసే అధికారం ఎంపీడీవోలకు అప్పగించారు. ఇక్కడే మరో మెలిక వేసింది గత ప్రభుత్వం. వీఆర్వోల్లో గ్రేడ్-1, గ్రేడ్-2 అంటూ రెండు కేటగిరీలు చేసింది. గతం నుంచి వున్న వీఆర్వోలను గ్రేడ్-1గా ఉంచి వారి వేతనాలు తహసీల్దార్ పరిధిలోనే అందించేలా పాత పద్ధతినే ఉంచారు. వీఆర్వోలుగా పనిచేస్తూ ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్వోలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం ఎంపీడీవోలు వేతనాలు చెల్లించేవిధంగా మార్పులు తెచ్చారు. అటు సచివాలయాల్లోనూ, విలేజ్ రెవిన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికి ఎంపీడీవోలే వేతనాల బిల్లులు పంపిస్తారు. గ్రేడ్-2 కింద వున్న వారు కూడా రెవిన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తారు.

సింహ వాహనంపై ఆదిదంపతుల విహారం

బంగారుపాళ్యం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో మూడవ రోజైన మంగళవారం ఉదయం కామాక్షి సమేత స్వామివారు నంది,సింహ వాహనాలపై పురవిహారం చేశారు. ఉదయం మూలమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించాక ప్రధాన అర్చకులు గంగాధరగురుకుల్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను వివిధరకాల పుష్పాలతో అలంకరించి అధికార నందివాహనంపై వారిని కొలువుతీర్చి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.గాండ్లపల్లెకు చెందిన సాంబశివనాయిని వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.రాత్రి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సింహ వాహనంపై పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు.బంగారుపాళ్యానికి చెందిన భారతి,ప్రతాపచంద్రనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంటీ విజయకుమార్,ఈవో మునిరాజ, అర్చకులు దండపాణి గురుకుల్, హరికేష్ గురుకుల్, మంజునాథ గురుకుల్,సోము గురుకుల్, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం అభిషేక పూజలుంటాయి.రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించిన తరువాత వృషభ వాహనంపై స్వామి,అమ్మవార్ల ఊరేగింపు వుంటుంది.



నందివాహనంపై విహరిస్తున్న శివయ్య



సింహవాహనంపై ఊరేగుతున్న ముక్కంటీశ్వరుడు

రామానాయుడుపల్లె వద్ద హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ వెంకటేష్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంత తదితరులు



సీఎం పర్యటన ఏర్పాట్లు షురూ

● చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను అబ్జర్వర్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు గంగాధరనెల్లూరు పర్యటన ఏర్పాట్లు వేగవంతమయ్యాయి.తొలుత బీసీ కాలనీతో పాటు దళితవాడలో ఇద్దరు పెన్షనర్ల ఇళ్ళవద్దకు వెళ్ళి సీఎం చంద్రబాబు పింఛన్ నిధులు అందజేస్తారు.ఈ సందర్భంగా దళితవాడలోని ప్రజలతో కొంతసేపు ఆయన మాట్లాడతారు. అనంతరం గంగాధరనెల్లూరు హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.గంగాధరనెల్లూరు సమీపం చిత్తూరు-పుత్తూరు రహదారిలోని రామానాయుడుపల్లె వద్ద సీఎం హెలికాప్టర్ దిగేందుకు వీలుగా ఏర్పాటుచేసే హెలిపాడ్ ప్రాంతాల్ని టీడీపీ నేతలు, వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం సీఎం ప్రోటోకాల్ కార్యక్రమాల అబ్జర్వర్ వెంకటేష్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంత పరిశీలించారు.ఎవరెవరు ఏఏ కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.టీడీపీ నేతలు భీమనేని చిట్టిబాబు నాయుడు, దేవసుందరం, రాంబాబురెడ్డి, సునీల్‌కుమార్, మోహన్‌నాయుడు, లోకేష్‌నాయుడు, జ్యోతిరెడ్డి, యువరాజారెడ్డి, గుండయ్య, నియాజ్‌అలీ,దేవరాజులు,రుషేంద్రరెడ్డి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, ఏఎస్పీ నందకిషోర్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ సాయినాథ్, ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి, ఎంపీడీవో హరిప్రసాద రెడ్డి, గంగాధరనెల్లూరు, పలమనేరు తహసీల్దార్లు చంద్రశేఖర్, ఇన్బనాథన్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత, విద్యుత్‌శాఖ ఏఈ వరదరాజులు, పంచాయతీ కార్యదర్శి చంద్ర, వీఆర్వో ఫాతిమా పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లెలో చిన్నారికి డెంగ్యూ

యాదమరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యాదమరి పీహెచ్‌సీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలోని పదేళ్ల చిన్నారికి డెంగ్యూ పాజిటివ్‌గా కేసు నమోదు కావడంతో స్థానిక ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలోని బాధితుడి ఇంటి వద్ద యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్వో) చేయించారు. మంచినీటిలో పెరిగే దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని, మంచి నీటిపాత్రలపై మూతలు ఉంచాలని అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో లక్ష్మీనారాయణ తెలిపారు. సబ్ యూనిట్ ఆఫీసర్ శివసుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, సర్పంచ్ పుష్పావతి, కార్యదర్శి దీప, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య పాల్గొన్నారు.



చెన్నారెడ్డిపల్లెలో మందును పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

రుణం కోసం..

ఈ జనాన్ని, వాహనాలను చూస్తుంటే ఏదో సభ జరుగుతున్నట్లుగా అనిపిస్తుందా.. వీరంతా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం వచ్చిన అభ్యర్థులు. గంగాధరనెల్లూరు మండలానికి 57 యూనిట్లు కేటాయించగా, 521మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 473మంది అభ్యర్థులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్లు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరవడంతో ఈ రద్దీ నెలకొంది. ఏర్పాట్లను ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్ పర్యవేక్షించారు.

\- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు



అభ్యర్థుల ద్విచక్ర వాహనాలతో నిండిపోయిన ఎంపీడీవో కార్యాలయం

మోటారు సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● 9 బైక్‌ల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పరిసరాల్లో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.65 లక్షల విలువ చేసే 9 బైకులను స్వాధీనం చేసుకొన్నారు. ఈ వివరాలను సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని బాపూజీ కాలనీ చెందిన ఇట్టా మహేంద్ర, షేక్ ఉజామ, కుదిరి తిప్పకండ్రిగకు చెందిన వంశీ.. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఇళ్ల ముందు, రైల్వేస్టేషన్ సమీపంలో నిలిపివున్న మోటరు సైకిళ్లను చోరీ చేసేవారు. వాటిని తమిళనాడులో విక్రయించేవారు. సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న మహేంద్ర, షేక్ ఉజామ, వంశీని పోలీసులు విచారించగా బైకుల చోరీ విషయం బయటపడింది. వారిచ్చిన సమాచారంతో బాపూజీ కాలనీ సమీపంలో పాడుపడిన ఇళ్ల వద్ద దాచి ఉంచిన 9 మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వంశీ 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. చోరీ చేసిన బైక్‌లను తీసుకెళ్లేందుకు తమిళనాడులో ఓ ముఠా ఉందని, త్వరలో వారినీ పట్టుకుంటామని సీఐ చెప్పారు.

తిరుమలలో కన్నప్ప బృందం



శివబాలాజీ, మంచు విష్ణు

తిరుమల శ్రీవారిని మంగళవారం కన్నప్ప సినిమా బృందం దర్శించుకుంది. హీరో మంచు విష్ణు, నటుడు శివ బాలాజీ, ఇతర చిత్ర బృంద సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఎంపీ జయరాం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, నటి నిహారిక, నవ్య కూడా స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నిహారిక - నవ్య


హుండీ ఆదాయం 4..14 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,764

తలనీలాలు సమర్పించినవారు: 23,504



క్యూలైన్లలోకి ప్రవేశం ఇలా..

భక్తులు వేర్వేరుగా ఆయా క్యూలైన్లలో ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం. ఆలయ 1వ గేటు నుంచి ఉచితక్యూలైన్, 2వ గేటు నుంచి రూ.200క్యూలైన్, మూడో గేటు నుంచి రూ.500 క్యూలైన్, 4వ గేటు నుంచి వీఐపీ ప్రవేశమార్గం కోసం క్యూలైన్లను పకడ్బందీగాసిద్ధం చేశారు. వీఐపీల ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యేక లాంజ్‌లను సిద్ధం చేశారు. ఇక, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్డీవో, ఈవో పర్యవేక్షణలో పరిమిత సంఖ్యలో వీఐపీలను దర్శనానికి పంపేలా ఏర్పాటు చేశారు.

ఆలయం లోపలా పక్కాగా..

ఆలయం లోపల ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయి గందరగోళ పరిస్థితులకు తావులేకుండా చర్యలు చేపట్టారు. మహద్వారంనుంచి స్వామివారిసన్నిధి, అక్కడి నుంచి అమ్మవారి గర్భగుడి వరకు క్యూలైన్లను ప్రణాళిక బద్ధంగా ఉంచారు. అమ్మవారి దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వెనుక వైపు నుంచి మెట్ల మార్గం ద్వారాదక్షిణగోపురం వద్దకు భక్తులు వెలుపలకు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయే అవకాశం లేదు. ఇక, అడ్డదారి దర్శనాలకు తావులేకుండా దక్షిణగోపురం, మహద్వారం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును కేటాయించారు.







ముక్కంటి మహాశివరాత్రికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు 1.5 లక్షల మంది భక్తులకు దర్శన సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది తొలిసారిగా భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. దర్శనానంతరం దక్షిణ గాలిగోపురం నుంచి భక్తులందరూ వెలుపలకు వచ్చేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ప్రసాదాల కౌంటర్లను భక్తులకు అందుబాటులో పెట్టారు. భక్తులందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం ఇచ్చేలా పెద్దఎత్తున తయారు చేశారు. అలాగే మహిళలకు సౌభాగ్యప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉచిత ప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.గతంలో పది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా... ఈసారి ఆలయ పరిసరాలతో పాటు పట్టణ వ్యాప్తంగా 25 శిబిరాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. క్యూలైన్లలో భక్తులకు పంపిణీ చేయడానికి రెండు లక్షల వాటర్ బాటిళ్లు, 2 లక్షల బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇక రాత్రి నంది సేవలో భక్తుల రద్దీకి అనుగుణంగా మాడవీధుల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధరాత్రిపైన ఆలయంలో లింగోద్భవం సందర్భంగా సామాన్య భక్తులందరూ దర్శించుకునేలా క్యూలైన్ విధానాన్ని పాటించనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బుధవారం వేకువజామున 4గంటల నుంచి పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలను ఆపేయనున్నారు. దీనికోసం అన్ని ప్రవేశ మార్గాల వద్ద పోలీస్ అవుట్ పోస్టులతో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల కోసం కేటాయించారు. పట్టణ అన్ని ప్రవేశ మార్గాలోని శివారు మార్గాల్లో మొత్తం 11 వాహనాల పార్కింగ్ కేంద్రాలను కేటాయించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ఉచిత రవాణా సౌకర్యాన్ని సిద్ధం చేశారు.



సిద్ధమైన ఉచిత దర్శన క్యూలైను



అద్దాల మండపం వద్ద క్యూలైన్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి





రూ500 క్యూలైన్లు



ఆలయంలో అకట్టుకుంటున్న పూల అలంకరణలు



రూ.200 క్యూలైన్

కల్యాణ వెంకన్న రథోత్సవం

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పాలంకృత రథంపై శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవమూర్తులను రథంలో అధిష్ఠింపజేశారు. గోవింద నామస్మరణల మధ్య అర్చకులు, అధికారులు,భక్తులు మాడవీధుల్లో రథాన్ని భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. రాత్రి పట్టు, పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో కల్కి అవతారంగా స్వామిని అలంకరించారు. ఉత్సవవర్లు అశ్వ వాహనంపై అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని సినీనటుడు డాక్టర్ మోహన్‌బాబు దర్శించుకున్నారు. అశ్వ



అశ్వవాహన సేవలో మోహన్‌బాబు



వాహన సేవలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవోల వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, కంకణ భట్టర్ నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి భారీ షాక్

● పవన్ సమక్షంలో పెద్దఎత్తున జనసేనలో చేరికలు

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన పది మంది కార్పొరేటర్లు, ఇద్దరు టౌన్‌బ్యాంకు డైరెక్టర్లు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లతో పాటు మరో 11 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో వీరంతా జనసేన కండువా కప్పుకొన్నారు. తొలుత వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు మాత్రమే జనసేనలోకి చేరుతారని ప్రచారం జరిగింది. అయితే పెద్దఎత్తున వైసీపీ నేతలు చేరడంతో రాజకీయంగా చర్చగా మారింది. డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో మనస్తాపంతో బయటకు వచ్చిన భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అనుచరుడు 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు పవన్ సమక్షంలో జనసేనలో చేరి షాక్ ఇచ్చారు. అలాగే, వైసీపీ కార్పొరేటర్లు పొన్నాల చంద్ర (28వ డివిజన్), టి.శైలజ (32వ), దూది కుమారి (33వ), కుడితి సుబ్రమణ్యం (36వ), రాధ యాదవ్ (43వ), ఆదం లీలావతితో పాటు ఇదివరకు చేరిన సీకే రేవతి (31వ), కల్పన యాదవ్ (30వ), వట్టికుంట నారాయణ (44వ డివిజన్) కూడా పవన్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. తిరుపతి టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొటారి సుభాష్‌తో పాటు అధికార ప్రతినిధి తిరుత్తణి వేణుగోపాల్, నాయకులు దూది శివ, ఎస్కే.ఫిరోజ్, పి.సుధీర్, నయనార్ శ్రీనివాసులు, సునీల్ చక్రవర్తి, యశ్వంత్, కార్తీక్, నరేష్ రెడ్డి, సీకే రవి, యాదవ కృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు ఆరణి మదన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.







జేఎస్పీలో చేరిన వైసీపీ యువత అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ - వైసీపీ సీనియర్ నేత, కార్పొరేటర్ ఎస్కే బాబు - టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్

చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వేసవిలో ఏనుగుల మంద నీటి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం సాధారణం. మే, జూన్ నెలల్లో ఇటువంటి సంఘటనలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఫిబ్రవరిలోనే ఏనుగుల మంద వచ్చి మామిడి తోపులు, వరి పంటలను ధ్వంసం చేయడం ఇదే మొదటి సారంటున్నారు. ఏనుగుల రాకను గమనించిన గ్రామస్తులు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏనుగుల దాడిలో గాయపడిన బాలికకు రుయాలో చికిత్స

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిలా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని శేషాచల అడవిలో ఏనుగుల గుంపు దాడి చేసినట ఘటనలో గాయపడిన బాలికకు తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స అందించారు. రైల్వే కోడూరు మండలం ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన 30 మంది తలకోనకు వచ్చేందుకు కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల సమయంలో శేషాచలం అటవీమార్గంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో మహాలక్ష్మి(16)ని రుయాస్పత్రి తీసుకురాగా, వైద్యులు పరీక్షించారు. ఆమె కాలిభాగం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఘటనలపై దర్యాప్తు చేయించండి

● హైకోర్టులో మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పిల్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన ఘటనలపై సీబీఐ లేదా హైకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మంగళవారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈనెల 3, 4 తేదీల్లో పోలీసులు, ఎన్నికల అధికారుల పాత్రపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ఏపీ ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.

ఇంటినుంచే జీవన ధ్రువీకరణ

సాంకేతికత తోడు... వృద్ధులకు చేదోడు

ముఖ ఆధారిత గుర్తింపుతో జీవన్ ధ్రువీకరణ - గడువుకు మిగిలింది రెండు రోజులే

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సర్కారు పెన్షనర్లకు ఏటా తాము జీవించే ఉన్నామని సర్టిఫికెట్ ఇవ్వాల్సి వుంటుంది. సాంకేతికత అందుబాటులో లేనిరోజుల్లో ఏటా జీవన్ ప్రమాణ్ ధ్రువపత్రాల ఆమోదానికి వృద్ధులు నానా తంటాలు పడేవారు.కొత్త ఏడాది ప్రారంభం రోజు నుండే కాగితాలను పట్టుకొని వయోభారానికి తోడు వ్యయ ప్రయాసలకోర్చి కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కొన్నేళ్ళుగా 'జీవన్ ప్రమాణ్' పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో వీరికి కొంతమేర కష్టాలు తగ్గాయి. కానీ బయోమెట్రిక్, ఐరిష్ విధానాల్లో చేతివేళ్ళు అరిగిపోవడం, కంటి సమస్యలతో కొందరికి ఇబ్బందులు కొనసాగేవి. వీరికి అవసరమైన సాంకేతికతను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నా, సమస్యలు వెంటాడేవి. ఇప్పుడు జీవన్ ప్రమాణ్ యాప్‌తో ముఖ ఆధారిత గుర్తింపు విధానం అమల్లోకి తీసుకొచ్చారు.ఇప్పుడున్నచోటనే స్మార్ట్‌ఫోన్ సాయంతో ఈ ప్రక్రియ పూర్తిచేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. దీని పుణ్యమా అని జిల్లాలో ఇప్పటికే దాదాపు 90శాతం పైగా పింఛన్‌దారులు ధ్రువీకరణ పూర్తిచేసుకున్నారు. మరో రెండురోజులే గడువు మిగిలివుంది.

● ఇప్పటికే 10,793 మంది ఆమోదం

ఏటా జనవరి నెల ఒకటో తేది నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు జీవన్ ప్రమాణ్ పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఎనిమిది ఉపఖజానా కార్యాలయాలుండగా, వాటిలో చిత్తూరు సబ్‌ట్రెజరీలోనే ఎక్కువ మంది పింఛన్‌దారులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 13,863 మంది పెన్షన్‌దారులుండగా, మంగళవారం నాటికి 10,793 మంది జీవన్‌ప్రమాణ్ ఇచ్చారు. ఇంకా 2,890 మంది ఇవ్వాల్సివుంది. గడువు పూర్తయ్యేందుకు మరో రెండ్రోజులే ఉంది. ప్రభుత్వ సూచనల మేరకు ఈనెల 28తో గడువు ముగియనుండడంతో ఖజానాశాఖ అధికారులు మిగిలిన పెన్షనర్లకు వారిచ్చిన సెల్‌ఫోన్లకు ఫోన్‌చేసి అప్రమత్తం చేస్తున్నారు.



చిత్తూరు సబ్ ట్రెజరీ వద్ద ఫేషియల్ ఫొటో కోసం వేచివున్న పెన్షనర్లు

చాలా సులభం



గతంలో జీవన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు పూర్తిచేసి, గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి ఖజానాశాఖ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఏటా ఈ ప్రక్రియ నిర్వహించేందుకు మాలాంటి వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే సులువుగా సమర్పించేవిధంగా జీవన ధ్రువీకరణ ప్రక్రియను సులభతరంచేసి ప్రభుత్వం ఆదుకుంది.

- విశ్రాంత ఉపాధ్యాయుడు శంకర్రావు

మరో రెండురోజులే గడువు



సెల్‌ఫోన్‌తోటే జీవన్ ధ్రువీకరణ పూర్తవుతుంది.గతంలో ఈ సమయానికి 50శాతం కూడా పూర్తయ్యేది కాదు. ప్రస్తుతం 95శాతంపైగా పూర్తయ్యింది.నడవలేని వారు ఉంటే, వారి ఇంటికే వెళ్లి మా సిబ్బందితో చేయిస్తున్నాం.ఇంకా పింఛన్ ధ్రువీకరణ పత్రం ఇవ్వనివారు వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఖజానా కార్యాలయానికి ఈనెల 28వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది.

- రామచంద్ర, డిప్యూటీ డైరక్టర్, జిల్లా ఖజానాశాఖ

ఏనుగుల దాడిలో వరి, టమోటా పంటలు ధ్వంసం



అన్నెమ్మగారిపల్లె వద్ద ఏనుగుల గుంపు సంచరించిన టమోటా తోట

సోమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి అన్నెమ్మగారిపల్లె గ్రామ సమీపంలోని టమోటా, వరి పంటలను తొక్కి నాశనం చేశాయి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. టమోటా పండ్లను తినేశాయి. కర్రలను విరిచేశాయి. ఇర్లపల్లె సమీపంలో ఏనుగుల ఘీంకారాలతో మేకల కాపరులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. నెల రోజులుగా ప్రశాంతంగా ఉన్న ఈప్రాంతంలో మళ్లీ ఏనుగుల ప్రవేశంతో అలజడి రేగింది. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల నుంచి పంటల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పీఎస్‌లకు ఇంటర్ ప్రశ్నపత్రాల తరలింపు



చిత్తూరు ఒకటో పోలీసు స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చేరిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను అధికారులు మంగళవారం ఎంపిక చేసిన పోలీసు స్టేషన్ల (పీఎస్‌ల)కు తరలించి, భద్రపరిచారు. ఈనెల 16 నుంచి మూడు విడతల్లో విజయవాడ నుంచి ప్రశ్నపత్రాలు వచ్చాయి. వీటిని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో తొలుత భద్రపరిచారు. ప్రస్తుతం జిల్లా పరీక్షల కన్వీనర్, జిల్లా ఒకేషనల్ విద్యాధికారి సయ్యద్‌మౌల, పరీక్షల ప్రత్యేక అధికారి దయానందరాజు, డిస్ట్రిక్ బల్క్ ఇన్‌చార్జి హేమలత, కమిటీ సభ్యులు శరశ్చంద్రశేఖర్, రియాజ్, నిర్మలాకుమారి, బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన నాలుగు రూట్లలోని 29 పోలీసు స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచారు.

ఎన్‌హెచ్ ఈఈగా శ్రీనివాసులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవేస్ (ఎన్‌హెచ్) ఈఈగా శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేస్తుండిన అబ్దుల్ సలాం ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో రాష్ట్ర కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసులును నియమించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



చిట్టెమ్మ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ కూలీ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని నలంగాడు పంచాయతీ ఎన్‌కోటూరు దళితవాడకు చెందిన సదాశివయ్య భార్య చిట్టెమ్మ(56) కూలీ పనుల్లో భాగంగా ఓ రైతు పొలంలో వరిపైరు కలుపు తీస్తున్నారు. పక్కనే మామిడి తోటకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తూ ఆమె చేయి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. పక్కనున్న కూలీలు గమనించి అరవడంతో గ్రామానికి చెందిన కొందరు ఆమెను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బంగారుపాళ్యం హెడ్ కానిస్టేబుల్ మురళీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లపై కేసు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఏడుగురిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు ఎస్టేట్ వద్ద పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ప్రభుత్వ ఐటీఐ వెనకాల కూడా పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురి వద్ద నుంచి రూ.40వేలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



ధరణీకృష్ణ

పెనుమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం పులికల్లు ఏపేడ బ్లాకు చెందిన ధరణీకృష్ణ(42) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన పూతలపట్టులో వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లి 11 గంటలకే ఆరోగ్యం సహకరించలేదని ఇంటికి వచ్చి పడుకుని నిద్రలోనే ప్రాణాలు విడిచినట్లు కుటుంబీకులు తెలిపారు. స్వగ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మల్లేశ్వర కొండకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలి : ఎఫ్ఆర్ఓ



మల్లేశ్వరకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయం

కల్లూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉండే మల్లేశ్వరస్వామి దర్శనానికి శివరాత్రి సందర్భంగా వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ ఎఫ్ఆర్ఓ థామస్ సుకుమార్, ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గుండాలమ్మకోనలో సోమవారం రాత్రి శివ భక్తులను ఏనుగులు తొక్కిచంపిన ఘటనపై అటవీశాఖ అప్రమత్తమైందన్నారు. ఇలాంటి ఘటనలు మరెక్కడా పునరావృతం కాకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగమే అటవీప్రాంతాల్లో ఉండే శివాలయాలకు రాత్రి పూట భక్తులు వెళ్లకుండా చూసేలా సిబ్బందికి హెచ్చరికలు జారీచేశామన్నారు. మండలంలోని దిగుమూర్తివారిపల్లి వద్ద ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసిన ప్రాంతం మల్లేశ్వరకొండ అతి సమీపంలో ఉందన్నారు. గతేడాదిలో మల్లేశ్వరకొండ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు అనేక పర్యాయాలు సంచరించాయన్నారు. మల్లేశ్వరకొండకు సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు రాత్రిపూట కొండవద్దకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. రాత్రిపూట కొండకు వెళ్లే భక్తులపై ఏనుగులు దాడికి పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరో పక్క రాత్రివేళ అకతాయిలు అడవులకు నిప్పుపెట్టే అవకాశాలు లేకపోలేదన్నారు. శివాలయానికి భక్తులు పగటి పూట మాత్రమే వెళ్లాలని, రాత్రిపూట వెళ్లడం విరమించుకోవాలన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ సూచన



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు రానున్నారు. అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి, పర్యటనను విజయవంతం చేయాలి' అని అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. మార్చి ఒకటో తేదీన గంగాధరనెల్లూరు మండలకేంద్రానికి వస్తున్న సీఎం కోసం.. హెలిప్యాడ్, ప్రజావేదిక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల కోసం తాగునీరు, బారికేడింగ్, పార్కింగ్, భద్రత ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



శేష, యాళి వాహనాలపై స్వామి, అమ్మవార్లు

శేష వాహనంపై పరమశివుడి విహారం

యాళి వాహనంపై జగదాంబ చిద్విలాసం ● ఉదయం హంస, శుక వాహన సేవలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి పరమశివుడు శేష వాహనంపై.. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై ఊరేగారు. అంతకుముందు ఆలయ అలంకార మండపం, యాగశాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ప్రదక్షిణగా గురుదక్షిణామూర్తి సన్నిధినుంచి రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ శేష, యాళి వాహనాలపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. స్వామిఅమ్మవార్ల ముందు మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారం సాగింది. స్వామిఅమ్మవార్ల పరివారాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. ఉదయం.. స్వామి అమ్మవార్లు హంస, శుక వాహనాలపై ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హంస, శుక వాహనాల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

బంగారు 'సూర్య'

8 కిలోల బంగారు ఆభరణాలతో శ్రీవారిని దర్శించుకున్న హైదరాబాదీ



తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అధిక బరువుతో కూడిన బంగారు ఆభరణాలను ధరించుకుని ఓ భక్తుడు శ్రీవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సూర్య దాదాపు ఎనిమిది కేజీల బంగారు ఆభరణాలతో తిరుమలకు వచ్చారు. మంగళవారం స్వామివారిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన ఆయన్ను పలువురు ఆసక్తిగా చూశారు. ఆలయం ముందు సూర్య మీడియాతో మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో ఎస్ఎస్ ఎస్ ప్రజాసేవా ఫౌండేషన్ నడుపుతున్నట్టు తెలిపారు. తల్లి బతికున్నప్పుడు నిత్యం బంగారు ఆభరణాలు వేసుకోమని చెబుతుండేదన్నారు. ఆమె చనిపోయిన తర్వాత ఆమె కోరిక మేరకు తాను ఈ ఆభరణాలను ధరించినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని నరసింహుడి ఆభరణం తన వద్దే ఉందన్నారు.

ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావాలని కూడా తెలియని వ్యక్తి జగన్

● అసెంబ్లీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావాలనే విషయం కూడా తెలియని వ్యక్తి మాజీ సీఎం జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వ్యంగోక్తులు విసిరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ 10మంది ఎమ్మెల్యేలతో కలసి ప్రతిపక్షనేత పదవికోసం గవర్నర్‌ను జగన్ బెదిరించడం రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు. రాని పదవి కోసం రాద్ధాంతం చేసి బయటికి వెళ్ళిపోయారని చెప్పారు. గవర్నర్‌ను బెదిరిస్తే శాసనసభలోని 164 మంది ఎమ్మెల్యేలు బెదురుతారని ఆయన అనుకుంటున్నారని..అయితే ఇక్కడ సుదీర్ఘ రాజకీయ అనుభవం వున్న సీఎం చంద్రబాబు ఉన్నారని జగన్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు జగన్ మంచి చేయలేదు కాబట్టే ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తుందని చెప్పారు.

ఇటుక లోడు ట్రాక్టర్ బోల్తా : నలుగురికి గాయాలు



బోల్తాపడ్డ ఇటుకలోడు ట్రాక్టర్

పెనుమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బందార్లపల్లెకు చెందిన రామనాదంరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇటుకలను పెనుమూరుకు తీసుకెళుతున్నారు. పులికల్లు పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్, ముగ్గురు కూలీలకు గాయపడ్డారు. బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి గాయపడిన వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలని సమాచారం.

అపోహాలు నమ్మకండి..చికెన్ తినండి

రాయలసీమ నెక్ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు



చికెన్ , కోడిగుడ్లను తింటున్న నెక్, హేచరీస్ ప్రతినిధులు

గంగవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'తక్కువ ధరతో అత్యధిక ప్రొటీన్లు కలిగిన పదార్థం ఏదైనా ఉంది ఉంటే అవి కోడి గుడ్లు, చికెన్ మాత్రమేనని అందుకే అపోహాలు వీడి చికెన్, గుడ్లు తినండి అని' రాయలసీమ నెక్ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. మంగళ వారం గంగవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలు హేచరీస్ యజమానులు, కోళ్లఫారం యజమానులు, కోళ్ల రైతులు, నెక్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్, కోడిగ్రుడ్ల పంపిణీ మేళా నిర్వహించారు. వీఎస్ఎన్ కంపెనీ ఎండీ ప్రణీత్ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు రీజియన్లలోమాత్రమే బర్డ్‌ఫ్లూ ఉందన్నారు. ఇక్కడ లేదని స్పష్టం చేశారు. అనంతరం రైతులు, ప్రజలతో కలసి చికెన్, కోడిగుడ్లను భుజించారు. ఈ కార్యక్రమంలో హేచరీస్, కోళ్లకంపెనీల నిర్వాహకులు వెంకట రెడ్డి, గోపాలక్రిష్ణ, రాజేంద్ర, రామచంద్రనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం నాయుడు, రమేష్, బాబునాయుడు, కోళ్లరైతులు, యజమానులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ మేళాకు ఎగబడ్డ జనం

పలమనేరు: ఉచిత చికెన్ మేళాలో ప్రజలు అత్యధికసంఖ్యలో చికెన్, కోడిగుడ్ల కోసం ఎగబడ్డారు. ప్రారంభంలో నాలుగు చికెన్ కబాబ్‌లు పంచిన నిర్వాహకులు జనం పెద్దసంఖ్యలో రావడంతో రెండు చికెన్ కబాబ్‌లు, రెండు కోడిగుడ్ల చొప్పున పంపిణీ చేశారు.

వైద్యులకు నైతిక ప్రవర్తన అవసరం



ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు

కుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్యులకు నైతిక ప్రవర్తన అవసరమని పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పోస్టు గ్రాడ్యుయేట్ (ఎండీ, ఎంఎస్) విద్యార్థులకు, యూజీ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇంటర్న్స్ కోసం మెడికల్ ఎథిక్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో రోగుల పట్ల కరుణ ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు మాట్లాడుతూ వైద్యవృత్తిలో నైతిక బాధ్యతల గురించి వివరించారు. మెడికల్ ఎథిక్స్‌పై విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో శిక్ష పడితే ప్రభుత్వ పథకాలు కట్



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాగరాజు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): సారా కేసులో చిక్కి శిక్షలు పడినవారు ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారని కుప్పం ఎక్సైజ్ సీఐ ఎ.నాగరాజు తెలిపారు. మండలంలోని దేవరాజపురంలో మంగళవారం నవోదయ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, విక్రయం నేరమన్నారు. సారా సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 14406కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. నవోదయ 2.0 కార్యక్రమంలో గ్రామ స్థాయిలో సారా నిర్మూలన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, ఎక్సైజ్ ఎస్సై జి.మోహన్‌బాబు, ఆర్ఐ వేణుగోపాల్, ఏఎస్ఐ వెంకయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తి కలిగేలా పిల్లలను తీర్చిదిద్దాలి



జ్ఞానజ్యోతి శిక్షణాకార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా అధికారి వెంకటరమణ

పలమనేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యపై ఆసక్తి కలిగేలా పిల్లలను తీర్చిదిద్దాలని జిల్లా అదనపు సంచాలకులు వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం పలమనేరులో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ విద్యకు దీటుగా అంగన్వాడీల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగేలా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషీర్, రిసోర్స్‌పర్సన్స్ జి.నాగరాజు, తిలక్, చందు, సీఆర్ఎంటీలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసును 62 ఏళ్ల వరకు కొనసాగించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామూర్తి, వెంటకరమణారెడ్డి , మున్సిపల్ కార్మికసంఘ నాయకులు నాగయ్య, ధర్మారెడ్డి, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని చింతలవీధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుమందిని అదుపులోకి తీసుకోగా మూడు ద్విచక్ర వాహనాలు, నగదు రూ. 3750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మొగిలికి ఉచిత బస్సులు

పలమనేరు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా మొగిలి శివాలయం వరకు పలమనేరు నుంచి ఉచిత బస్సులు నడుపుతున్నారు. ఈశ్వర్ అభయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులు నడుపుతున్నట్లు బెంగళూరులోని ఓఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆర్.ఎం.ఈశ్వరనాయుడు తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 5 నుంచి 27వ తేదీ ఉదయం 10 గంటల వరకు మూడు ఉచిత బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంగుందిలో గ్రామీణ క్రీడలు

కుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని కంగుందిలో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రామీణ క్రీడలు నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం వీటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలో ర్యాలీలో పాల్గొన్నారు. తదేకం ఫౌండేషన్ సభ్యుడు సంజయ్‌రావవు మాట్లాడుతూ కంగుందితోపాటు పరిసర గ్రామాలలో వారసత్వంగా వస్తున్న శిలలు, ఆలయాల వివరాలను ఫొటోలతో సహా ఒక పుస్తకంగా తీసుకురావడానికి తమ ఫౌండేషన్ శ్రమిస్తోందని చెప్పారు. మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదేకం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి సేవలో జడ్పీ ఛైర్మన్

పలమనేరు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని టీఎస్. అగ్రహారం వద్ద వెలసిన వల్లీ దేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేయించారు.

శాసనసభలో వైసీపీ తీరు దుర్మార్గం: గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్‌కు కావాల్సింది హోదా తప్ప ప్రజా సమస్యలు కాదని పేర్కొన్నారు. ప్రజలివ్వని హోదాను కోరుకోవడం ఆయన నియంత ధోరణిని స్పష్టం చేస్తోందని తెలియజేశారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

రామకుప్పం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం రామకుప్పం మండలంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దరఖాస్తులు చేసుకున్న 320మందిలో మొదటి రోజు జరిగిన ఇంటర్వ్యూలకు 229 మంది హాజరయ్యారు. ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, బ్యాంకర్లు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.

నైపుణ్యం పెంపొందించాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే పిల్లల్లో నైపుణ్యత పెంపొందించాల్సి వుందని సమగ్ర శిక్షప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్లో జరుగుతున్న అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు బొమ్మల రూపంలో విద్యను అంగన్వాడీ కార్యకర్తలు సులభంగా నేర్పించడం వల్ల పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుంద న్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, పాఠశాల హెచ్ఎంలు వసుంధర, సుబ్రహ్మణ్యం, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రేపు పుంగనూరు మున్సిపల్ సమావేశం

పుంగనూరు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వాహనాల వేలం.. రూ.1.97లక్షల ఆదాయం

పుంగనూరు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయగా రూ. 1.97లక్షలు ఆదాయం చేకూరినట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో 22 ద్విచక్ర వాహనాలను వేలానికి ఉంచగా 13 వాహనాల మాత్రమే పాటదారులు దక్కించుకున్నారు.


జిల్లా టాపర్లుగా నిలవాలి



విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న టీడీపీ నేతలు

వి.కోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జరగబోయే పదో తరగతి పరీక్షలో విద్యా ర్థులు ఒత్తిడిని అధిగమించి ఉత్తమ ఫలితాలతో జిల్లా టాపర్లుగా నిలవాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు కోరారు. మంగళవారం పట్టణం లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నలంద విద్యాసంస్థల వారు పరీక్షా సామగ్రిని టీడీపీ నేతల చేతుల మీదుగా అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మాజీ కార్యదర్శి సోము, కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వినయ్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు సిద్ధం



దుర్గం మల్లేశ్వరస్వామివారి వెలసిన కంగుంది దుర్గం





మల్లప్ప కొండపై మల్లేశ్వరస్వామి , తుమ్మిసిలో వెలసిన సోమేశ్వరస్వామి

కుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామివారి ఆలయం ముందు షామియానాలు వేసి, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం స్వామివారికి అంగరంగ వైభవంగా రథోత్స వం జరిగింది. బుధవారం ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు అన్న దానం చేస్తారు. హరికథా కాలక్షేపం, శివ పార్వతుల నృత్య ప్రదర్శన, రాత్రి వీధి నాటకం ప్రదర్శిస్తారు. 27న మహా మంగళ హారతితో ఉత్సవాలు ముగు స్తాయి. అలాగే కుప్పం మండలం కంగుంది దుర్గంపై వెలసిన దుర్గం మల్లేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూ జలు జరుగుతాయి. గిరిజా కళ్యాణం జరుగు తుంది. విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేయనున్నారు. రాత్రి వీధి నాటకం, బాణ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. కుప్పం పట్టణంలోని సోమేశ్వరాల యం, శాంతిపురం మండలం తుమ్మిసిలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరగనున్నాయి. రామకుప్పంలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలమాలలతో అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వారికి రుద్రాభిషేక పూజలు జరుగుతాయి. రాత్రి 7 నుంచి తెల్లవారు జాము వరకు వివిధరకాల అభిషేకాలు నిర్వహిస్తారు.

ఆలయాలకు విద్యుత్ శోభ



విద్యుత్ అలంకరణలో భోగనంజుండేశ్వర ఆలయం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలను విద్యుత్ అలంకరణలతో సర్వంసిద్ధం చేశారు. పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి, భోగనంజుండేశ్వస్వామి, అమెర వీరభద్రస్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రూపు ఆలయాల ఈవో కమలాకర్ ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి మంగళవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాలల్లో భాగంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేక అలంకరించి దేవీహోమం, కళాహోమాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకున్నారు.

కోటి లింగాల ఆలయం ముస్తాబు

వి.కోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా కమ్మసంద్రలో వెలసిన కోటిలింగేశ్వరాలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కోటిలింగేశ్వర స్వామికి ఉదయాన్నే ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. 108 అడుగుల మహాశివలింగానికి పాలాభిషేకం జరిపేందుకు ఏర్పాట్లు చేపట్టారు. అక్కడ మహాశివలింగానికి ముందు 36 అడుగుల నంది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాలాభిషేకం అనంతరం రథోత్సవం జరగనుంది. రాత్రికి కోలాటలు, పండరి భజనలు, బాణసంచా వేడుకలు, భక్తి గీతాలాపన, నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ మండపంలో స్వామి వారి పేరిట హరి కథ కాలక్షేపం ఉంటుంది. ఆలయ కమిటీ వారు భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు.

నేత్రపర్వంగా మల్లేశ్వరుడి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లప్ప కొండలోని వెలిసిన మల్లేశ్వరుడి ఆలయంలో మంగళవారం మల్లేశ్వరుడు, పార్వతీ దేవి కల్యాణం, రథోత్సవం నేత్రపర్వంగా జరిగాయి. మల్లేశ్వరుడి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం మల్లేశ్వరుడకి వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంక రించారు. అర్చకులు ఆలయలో రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం మల్లేశ్వరుడు, పార్వతీ దేవి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయం ఎదుట ఆసీనుల్ని చేశారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు ఫల, పుష్ప తాంబూలాలతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. వేదపండితులు బాబు, సోమశేఖర్‌ల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణోత్స వాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి రథంపై అధిష్ఠింపజేశారు. ఆ తరువాత మంగళ వాయిద్యాల నడుమ రథోత్సవాన్ని ఆలయ వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులు పట్టారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

మల్లేశ్వరకొండపై శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

కల్లూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ పరిధిలో మల్లేశ్వరకొండపై వెలసి మల్లేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లను మంగళవారం కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వేడుకల ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారికేడ్లు, క్యూలైన్లు, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. వాహనదారులు పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలు నిల పాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ నాయుడు, ప్రసాద్, రాజగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లాబాబు పట్టువస్త్రాల సమర్పణ

మల్లేశ్వరకొండపై వెలసిన శివపార్వతులకు బుధవారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రసాద్ రాయల్ తెలిపారు.

అడవికి నిప్పు- మానవాళికే ముప్పు

పలమనేరు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు- మానవాళికి ముప్పు అని అటవీ రేంజర్ నారాయణ తెలియజేశారు. అటవీ సంరక్షణపై మండలం లోని అటవీ గ్రామాల్లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. నవ్య ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం జానపద గీతాలు, మ్యాజిక్‌షోల ద్వారా ప్రజలకు అడవులపై అవగాహన కల్పించారు. కేజీపెంట, గొబ్బిళ్లకోటూరు. జగమర్ల, దేవళంపేట గ్రామాల్లో కళాజాతా బృందం సభ్యులు పర్యటించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అఫీసరు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతితో చిన్నారులకు మెరుగైన బోధన



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న పీవో వెంకటరమణ

చౌడేపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): జ్ఞాన జ్యోతితో చిన్నారులకు మెరుగైన బోధన అందుతుందని పీవో వెంకటరమణ తెలియజేశారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా నిర్వహించిన జ్ఞానజ్యోతి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు నూతన విద్యనందించేందుకు కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైడ్రోసోనిక్ యూనిట్ వితరణ



చౌడేపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌కు హైడ్రోసోనిక్ యూనిట్‌ను దాత శ్రీనివాసులు నాయుడు విరాళంగా అందజేశారు. మంగళవారం ఆయన స్థానిక హైస్కూల్ విద్యార్థుల కోసం ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈ పరికరాన్ని అందించారు. దాతను హెచ్ఎంలు నాగరాజరెడ్డి, నాదముని నాయుడు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, మధుసూదన్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, విజయలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

చౌడేపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తల్లి ప్రేమలతరెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సతీమణి రేణుకరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సోమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం మిట్టపల్లె కమ్మపల్లెలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద గేట్ వాల్ మరమ్మతులు చేపట్టారు. కొద్ది రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎంపీడీవో నారాయణ, కార్యదర్శి జయశంకర్ ట్యాంకును పరిశీలించి బాగుచేయించారు.

28లోపు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) రైతులు ప్రభుత్వ పథకాలు పొందడానికి ఈనెల 28వ తేదీలోపు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని గానుగ చింత, మోటమల్లెల, రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె రైతు సేవా కేంద్రాలలో రైతు గుర్తింపు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆమెవెంట ఏవో సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వర స్వామి, రొంపిచెర్ల సిద్ధేశ్వరస్వామి, మోటమల్లెల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలను పచ్చతోరణాలు, విద్యుత్ దీపాలలో అలంకరించారు. రొంపిచెర్ల సిద్ధేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. గురువారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించ నున్నారు. అదేరోజు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. శుక్రవారం సిద్ధపూజ జరగనుంది. పెద్దకురవపల్లె నుంచి పోతులురాజుతో శివాలయానికి మంగళ వాయిద్యాలతో రానున్నారని ఆలయ ఛైర్మన్ సుధాకర్, నాగరాజ తెలిపారు.

సోమల: మండలంలోని శైవ క్షేత్రాలు శివరాత్రి ఉత్సవాలకు సుందరంగా ముస్తాబయ్యాయి. పెద్దఉప్పరపల్లె సమీప దుర్గం కొండలో గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం, ఇరికిపెంట పంచాయతీ మధురమల్లె కొండలోని మల్లేశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరపురంలోని మల్లేశ్వరాలయం, కందూరు మల్లికార్జున స్వామి ఆలయం, చెరుకువారిపల్లె అర్ధనారీశ్వరస్వామి, పెద్దఉప్పరపల్లె సమీపం లోని మోక్షేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, సీతమ్మ చెరువు కట్ట వద్ద సోమేశ్వరస్వామి ఆలయం రాశెట్టివారిపల్లె, సోమల స్వయం భేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు



విద్యుత్ దీపాలంకరణలో అగస్త్యేశ్వరస్వామి ఆలయం



విద్యుత్ దీపాలంకరణలో చౌడేపల్లె మృత్యుంజయస్వామి ఆలయం

పుంగనూరు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలు, ఏర్పాట్లతో ముస్తాబయ్యాయి. బుధవారం మహాశివరాత్రికి భక్తులు శివాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి జాగరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆలయాల నిర్వహకులు, అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆలయాలకు రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు, పచ్చని పందిళ్లు వేశారు. పుంగనూరు మండలం నెక్కుంది వద్ద గల దక్షిణకాశీగా పేరు గాంచిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అభిషేకం, సింహ వాహనోత్సవం, నిత్యోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి. పుంగనూరు ఆర్టీసీ అధికారులు అగస్త్యేశ్వరస్వామి కొండకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే పుంగనూరు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, భోగనంజుండేశ్వరస్వామి, అమెరవీరభద్రస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి..

● సోమల మండలం పెద్దఉప్పరపల్లె వద్ద గల దుర్గమ్మ కొండ, గార్గేయ మునీశ్వరస్వామి, ఇరికిపెంట వద్దగల మధురమల్లె కొండలోని మల్లేశ్వరస్వామి ఆలయం, సోమల శంభోశ్వరస్వామిఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు రాత్రి జాగరణకు శివకోటి జపయజ్ఞం వైభవంగా జరగనున్నాయి.

● చౌడేపల్లె మృత్యుంజయస్వామి ఆలయంలో నాలుగు యామాల పూజలు, పంచామృత అభిషేకాలు, ఎర్రపల్లెలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, నంది వాహనంపై ఊరేగింపు, పుదిపట్లలో పంచపాడవులు ప్రతిష్ఠించిన పంచలింగేశ్వరస్వామి ఆలయలాల్లో రుద్రాభిషేకాలు, ఎ.కొత్తకోటలో చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు, శివకోటి జరుగనుంది.

నమశ్శివాయ

మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



● వీరభద్రస్వామి ఆలయం



ఐరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐరాల గార్గేయినదీ తీరాన ఉన్న మఠంపల్లెలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. స్వామికి కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరఫున రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన శివునికి మహన్యాస రుద్రాభిషేకం చేస్తారు. భక్తుల జాగరణ కోసం పౌరాణిక నాటిక కోలాటాలు ఉంటాయి.

● కొండమల్లీశ్వరస్వామి ఆలయం



వెదురుకుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధ్వజారోహణం మొదలుకుని విశేష పంచామృత రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు ఉంటాయి. టీటీడీ కళాకారుల ఆధ్వర్యంలో హరికథ, అన్నమయ్య కీర్తనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

● కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం



నగరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేయనున్నారు. రాత్రి హరికథా కాలక్షేపం నిర్వహిస్తారు. ● నగరి పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శతరుద్రీయ మహాయాగం నిర్వహించనున్నారు.

● అగస్తీశ్వర, కాశీ విశ్వేశ్వర ఆలయాలు





చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, కాశీ విశ్వేశ్వర, కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్రస్వామి, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయాల్లో రుద్రాభిషేకాలు, కాల పూజలు జరుగుతాయి.

● మొగిలీశ్వరుడి ఆలయం



బంగారుపాళ్యం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వారి ఆలయంలో ఉదయం మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం చేస్తారు. వృషభవాహనంపై స్వామివార్లను ఊరేగిస్తారు. రాత్రికి వారణావతం నాటకం, భజనకార్యక్రమాలు ఉంటాయి.

● ఏకాంబరేశ్వరాలయం



యాదమరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో ఉదయం మంజునాథ రూపంలోని స్వామికి రుద్రాభిషేకం చేస్తారు. రుద్రాభిషేకాలు ఉంటాయి.

పిల్లలను ఆకట్టుకునేలా విద్యాబోధన ఉండాలి

పెనుమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను ఆకట్టుకునేలా విద్యాబోధన ఉండాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు సూచించారు. పెనుమూరు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం చివరి రోజుకావడంతో స్టాల్స్ వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ట్రైనర్లు సురేంద్ర, నాగరాజు, బాబు, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విజయపురం: ఉన్నత పాఠశాల ఆవరణంలో అంగన్వాడీలకు జరిగిన శిక్షణలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు గ్రూపు యాక్టివిటీ, బొమ్మల తయారీ వంటి అంశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ లక్ష్మి, శిక్షకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోషకాల పూజ



మహానందికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చక, పండితులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వరాలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోషకాల పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శివునికి(మణికంఠేశ్వరుడు), ఆవరణలోని మహానందికి ఏకకాలంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈవో పెంచలకిశోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

కులందేశ్వర ఆలయంలో..

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): కట్టమంచి కులందేశ్వర ఆలయంలోనూ మంగళవారం స్వామి వారికి ప్రదోష పూజలు జరిగాయి. త్రయోదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కామధేనువాహనంపై



.. ఏకాంబరేశ్వరుడి విహారం

యాదమరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భోళాశంకరుడిగా కామధేను వాహనంపై గ్రామంలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి ఆదిశేషుడి వాహనంపై దర్శనమిచ్చారు. ఉభయదారులు ఎ.మురుగా రెడ్డి, ఎ.వినాయకం రెడ్డి, అర్చకుడు కాసలనాటి చంద్రశేఖర్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

.. చిదంబరేశ్వరుడి చిద్విలాసం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లు.. కామదేను వాహనంపై విహరించారు. సాయంత్రం బిక్షాండి ఉత్సవం జరిగింది. ఉత్సవ నిర్వాహకుడు కృష్ణమూర్తి, ఆలయ అర్చకుడు మహేష్, భక్తులు పాల్గొన్నారు.

నంది వాహనంపై కాలభైరవేశ్వరుడు



తవణంపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి నందివాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు వినాయకం, దొరబాబు, స్థానికులు, పరిసర గ్రామస్తులు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాయులింగం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూర్యప్రతాప్ కళ్యాణ మండపంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 21 అడుగుల వాయులింగం ఆకట్టుకుంది. కట్టమంచి వరదరాజ స్వామి ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు.

జగన్ రెడ్డి తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదం: టీడీపీ



సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డి తీరు ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డికి ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం ఇస్తే తమకు, తమ ఆస్తులకు రక్షణ ఉండదనే ప్రజలు.. ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా ఇవ్వలేదని చెప్పారు. దాన్ని గుర్తించకుండా ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లి కనీసం 11 నిమిషాలు మాత్రమే ఉండి బయటకు వచ్చేయడం సరికాదన్నారు.

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక



మీడియాతో మాట్లాడుతున్న చెన్నకేశవులు నాయుడు తదితరులు

గుడిపాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు, పార్టీ సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన ఎనిమిది నెలల వ్యవధిలోనే అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పందించి వారికి సీఎం సహాయనిధి ఆర్థిక సాయం అందజేశారని చెప్పారు. మాజీ సర్పంచ్ జయచంద్రనాయుడు, నాయకులు గణేష్, దొరస్వామి నాయుడు, మురళీనాయుడు, మణిగౌండర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా పనిచేయకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ పురుషోత్తం హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఎక్సైజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎక్సైజ్ డీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఎక్సైజ్ డీసీ విజయకుమార్, ఈఎస్ శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను తెలియజేశారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు జవహర్ బాబు, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



అధికారులకు చెక్‌ను అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన నరసింహమూర్తి రూ.1,01,116ను చెక్కు రూపంలో మంగళవారం విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి: కాంగ్రెస్



డప్పు కొడుతూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ముందు డప్పు కొట్టి నిరసన తెలిపారు. నేతలు పరదేశి, సుబ్బరాయులు, దొరస్వామి, ఉమేష్, భాగ్యరాజు, రెడ్డి కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు బొమ్మసముద్రంలో శ్మశానకొల్ల

గుడిపాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రంలో గురువారం శ్మశానకొల్ల నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. 27న ఉదయం 7 గంటలకు అమ్మవారి అభిషేకం, పాల బిందెలతో ప్రదర్శన, మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి ఊరేగింపు, ఆపై శ్మశానకొల్ల, సాయంత్రం ఆరు సింహవాహనంపై అంకాలపరమేశ్వరిగా అమ్మవారి దర్శనం ఉంటుందని వివరించారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిప్పినాయుడుపల్లె బీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు చెంగల్రాయులు(60) మృతి చెందారని స్థానికులు మంగళవారం తెలిపారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత జీడీ నెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉపేంద్ర, బూత్ కన్వీనర్ పవన్, నాయకులు కిరణ్, గోవిందయ్య, కందస్వామి, శివయ్య, వెంకటేష్ తదితరులు అక్కడికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి.. నివాళి అర్పించారు.

సంక్షిప్తంగా..

యూరియా అధికంగా వాడొద్దు: ఏవో

గుడిపాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు యూరియాను అధికంగా వాడొద్దని మండల వ్యవసాయ అధికారి మాధవి అన్నారు. మంగళవారం తిమ్మాపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారులు తులసీరెడ్డి, యోగప్రియ పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. మండలంలో రెండు నెలలుగా కూలీల సంఖ్య తగ్గిపోయిందని, ప్రతి పంచాయతీలో రోజుకు 150 మంది పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో మార్గరేట్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలోనే కర్మక్రియలు చేసుకోవచ్చు: కమిషనర్

నగరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కుశస్థలీ నదికి సమీపాన పట్టణానికి చెందిన హిందూ శ్మశాన వాటికలోనే కర్మక్రియలు చేసుకోవచ్చని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. రూ.4000 మున్సిపాలిటీకి చెల్లించి ఈ సదుపాయాలను పొందవచ్చన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు

పూతలపట్టు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ డిప్యూటీ సీఈవో జుబేదా తనిఖీ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలా వినియోగిస్తున్నారని ఎంపీడీవో నాగరాజును అడిగి తెలుసుకున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

నేడు మయాన సేవ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా అమ్మవారికి గరికపూజ, గ్రామోత్సవం, బ్రహ్మ కపాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బి.కుమార్ తెలిపారు. అలాగే మయాన సేవను నీవానది శ్మశానంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 27న అమ్మవారికి కుంభం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెరకు పంట దగ్ధం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తీగల నుంచి నిప్పురవ్వలు పడి తన చెరకు పంట దగ్ధమైందని యనమలమందకు చెందిన నీలకంఠం మంగళవారం తెలిపారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

25 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాను, సామగ్రిని చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల పరిధిలో సారా స్థావరాలపై సోమ, మంగళవారాల్లో పోలీసులు దాడులు చేశారు. 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. వివరాలను కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ మంగళవారం మీడియాకు తెలిపారు. కన్నికాపురం గ్రామ సమీపంలోని గుట్ట ప్రాంతంలో సారా స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. గోపిశెట్టిపల్లె కాలనీలోని గోవిందరాజులుకు చెందిన 300 లీటర్ల సారా ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసి, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏఎస్ఐ మునికృష్ణ తన సిబ్బందితో కలిసి కొటార్వేడు కాలనీపరిధిలో ఉన్న గుట్ట సమీపంలో దాడులు చేశారు. కొటార్వేడు కాలనీలోని శ్రీరాములుకు చెందిన వంద లీటర్ల సారా ఊట, పరికరాలను ధ్వంసం చేశారు. ఇరవై లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రేపు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

పెనుమూరు/ విజయపురం/ గుడిపాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు, విజయపురం, గుడిపాల మండలాల పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తున్న చేసుకున్న వారికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా ఎంపీడీవోలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చేటప్పుడు అభ్యర్థులంతా తమ పాస్‌పోర్టు ఫొటోతోపాటు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్‌లను తీసుకురావాలని సూచించారు.

మురికి కూపంగా వెంకటప్పనాయిని చెరువు / భూగర్భజలాలు కలుషితం అవుతాయంటున్న పరిసర గ్రామస్తులు



మురుగుతో నిండిన వెంకటప్పనాయిని చెరువు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వెంకప్పనాయినిచెరువు నీరు స్వచ్ఛంగా ఉండేది. ప్రస్తుతం మురికి కూపంగా మారింది. ఈ చెరువుకు 15 ఏళ్లుగా బంగారుపాళ్యం పంచాయతీ, ఇందిరమ్మ కాలనీ, తగ్గువారిపల్లె, శాంతినగర్ గ్రామాలకు చెందిన మురుగును మళ్లించడమే దీనికి కారణమైంది. చెరువులోకి చేరుతున్న మురుగు వల్ల భవిష్యత్తులో భూగర్భజలాలు కలుషితం అవుతాయని చుట్టుపక్కల గ్రామాలైన ముంగరమడుగు, జంబువారిపల్లె, ఎర్రాండ్లపల్లె, జయరామాపురం, దండువారిపల్లె, మాధవనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బోరు బావుల్లో నీరు ఉప్పగా మారిందని చెప్పారు. దీనివల్ల మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఇకనైనా ఈ మురుగును చెరువులోకి చేరకుండా అరగొండకు వెళ్లే రహదారి గుండా సుమారు కిలోమీటరు మేర కాలువ నిర్మించి పెద్దవంకలో కలిపితే సమస్య పరిష్కారమవుతుందని ఆయా గ్రామాల వారు అంటున్నారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



మంగరమడుగులో మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్న మహిళలు